సీటీఎం రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు

- వందేళ్ల చెట్లు తొలగించినా తీరని చింత
- రోడ్డుపైనే వాహనాల పార్కింగ్
- నెలరోజులవుతున్నా తీరని ట్రాఫిక్ కష్టాలు
- ఎమ్మెల్యే హామీలన్నీ ఉత్తుత్తినేనా?

మదనపల్లె : పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సీటీఎం రోడ్డులోని వందేళ్లకు పైబడిన చింతచెట్లను తొలగించి, రోడ్డు విస్తరణ చేసేస్తామన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హామీ నీటిమూటగానే మిగిలిపోయింది. మదనపల్లె గ్రీన్‌బెల్ట్‌గా పేరుపొందిన సీటీఎం రోడ్డులో పచ్చదనం కనుమరుగైందే తప్ప, పరిస్థితిలో ఏ మాత్రం మార్పు లేదు. చెట్లు ఉన్నప్పుడు క్రమపద్ధతిలో ఉన్న వాహనాల పార్కింగ్ కాస్తా...ఇప్పుడు ఇష్టారాజ్యంగా తయారై వాహనదారులకు కొత్త కష్టాలు తెచ్చి పెడుతోంది. చెట్లు కొట్టినన్ని రోజులు...ప్రతిరోజు అక్కడే ఉంటూ, ప్రజల కోసమే అంటూ హడావిడి చేసిన ఎమ్మెల్యే షాజహాన్ బాషా.. తర్వాత పట్టించుకోకపోవడంతో సీటీఎం రోడ్డు పరిస్థితి దారుణంగా తయారైంది. సీటీఎం రోడ్డు విస్తీర్ణం వదలివేసి, వాహనాలు పార్కింగ్ చేసుకోవాలని, రెండు వైపులా వాహనాలు వెళ్లేందుకు దుకాణదారులను అప్పట్లో ఎమ్మెల్యే కోరారు.

ఫ్లైఓవర్ ఎప్పుడు..?


సీటీఎం రోడ్డులో ఇష్టారాజ్యంగా నిలిపిన వాహనాలు


ట్రాఫిక సమస్యతో నిలిచిపోయిన వాహనాలు

అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిస్తే...సీటీఎం రోడ్డు నుంచి ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.12 కోట్లు మంజూరు చేశారని గొప్పలు చెప్పుకున్న ఎమ్మెల్యే.... ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. చెట్లు కొట్టివేసిన రెండురోజుల తర్వాత మున్సిపల్ టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డు వాస్తవహద్దులు తేల్చేందుకు జాయింట్ సర్వే నిర్వహించారు. అయితే సర్వే కాస్తా నగం మధ్యలోనే నిలిపివేసినట్లు సమాచారం.

గుంతలు కూడా పూడ్చలేరా?

సీటీఎం రోడ్డులో తొలగించిన చింతచెట్ల స్థానంలో ఏర్పడ్డ గుంతలను పూర్తిస్థాయిలో పూడ్చకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు బురదమయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చింత చెట్లను తొలగించి నెలరోజులకు పైగానే అవుతున్నప్పటికీ, ఇప్పటివరకు అటు మున్సిపల్, అటు ఆర్అండ్‌బీ అధికారులు విస్తరణ పనులు కానీ, రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటు పనులు చేయకపోవడంతో... ఇంత మాత్రానికి అంత హడావిడి ఎందుకు చేశారంటూ విమర్శలు వినిపిస్తున్నాయి.

విస్తరణ పేరుతో ఉన్న చెట్లు తొలగించారు

సీటీఎం రోడ్డు విస్తరణకు దుకాణదారులు అంగీకరించడం లేదని, రోడ్డు వెడల్పు చేస్తే తమకు ఇబ్బందులు ఎదురవుతాయని, ప్రస్తుతం ఎలా ఉందో అలాగే వదిలేస్తే తమకు సౌకర్యంగా ఉంటుందని పెద్ద మొత్తంలో బేరసారాలు సాగించినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అందుకే సీటీఎం రోడ్డును పట్టించుకోకుండా అలాగే వదిలేశారని, పట్టణ వాసులు ట్రాఫిక్ కష్టాలు ఇప్పట్లో తీరేవి కావని, ప్రజలు బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. పచ్చదనంతో కళకళలాడుతున్న వందేళ్ల వృక్షాలను, అధికారబలంతో అడ్డంగా నరికివేయడంపై కొందరు ప్రకృతిప్రేమికులు...ఆర్అండ్‌బీ అధికారులపై నేషనల్ గ్రీన్‌ట్రిబ్యునల్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు చేసినట్లు సమాచారం.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పీలేరు : మండలంలోని వేపులబైలు సబ్ స్టేషన్‌లో పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఏ అమీర్ బాషా తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 6 నుంచి సాయత్రం ఆరు గంటల వరకు వేపులబైలు, దొడ్డిపల్లె, బోడుమల్లువారిపల్లె తోపాటు పీలేరు పట్టణం మదనపల్లె మార్గంలో రైల్వే గేటు నుంచి రైల్వేస్టేషన్ వరకు ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

కలకడ : పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ టి.హరిబాబు తెలిపారు. వివరాలిలాఉన్నాయి. మండలంలోని దిగువతాండ గ్రామ సమీపంలోని మొరవగుట్టమీద వద్ద దిగువతాండ గ్రామానికి చెందిన వారు ఆదివారం పేకాట ఆడుతున్నట్లు అందిన రహస్య సమాచారం మేరకు హెడ్ కానిస్టేబుల్ తన సిబ్బందితో దాడులు నిర్వహించి జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనుంచి రూ.30,300 నగదు, 5సెల్ ఫోన్లు, 5ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

13న అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసులు

పీలేరు : ఈ నెల 13న పీలేరు నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డీఎం కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 13న అరుణాచలంలో మహాదీపం సందర్భంగా ఉదయం 6 గంటలకు ప్రత్యేక సర్వీసులు బయలుదేరు వెళతాయని, రానూ పోనూ టికెట్ రూ. 700 ఆన్‌లైన్‌లో సీటు రిజర్వేషన్ చేసుకోవాలని కోరారు. వివరాలకు 9959225679, 9014200628, 9440992435 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

నియామకం


నియామక పత్రం అందుకుంటున్న రవీంద్ర

బి.కొత్తకోట: నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా బి.కొత్తకోటకు చెందిన కె.రవీంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు కే.వెంకటేష్ నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన రవీంద్ర మాట్లాడుతూ మానవ హక్కుల కోసం పోరాడుతానని అన్నారు.

గడ్డివామి దగ్ధం


గడ్డివామి మంటలను ఆర్పుతున్న స్థానికులు

నిమ్మనపల్లె : గడ్డివామి దగ్ధమై రైతు నష్టపోయిన ఘటన ఆదివారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. మండలంలోని కొండయ్యగారిపల్లె పంచాయతీ వెంకోజిగారిపల్లెకు చెందిన రైతు నాగరాజు ఇంటివద్ద పశువుల కోసం వరి గడ్డి వామి వేశాడు. ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు గడ్డివామికి నిప్పంటుకుని మంటలు రేగాయి. గమనించిన స్థానికులు వెంటనే మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే అప్పటికే గడ్డివామి పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.60వేల నష్టం కలిగినట్లు రైతు నాగరాజు తెలిపారు.

ఎమ్మెల్యేకు సన్మానం


కందుకూరులో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం: తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆదివారం మండలంలోని కమ్మచెరువు పంచాయతీ మారుగానిపల్లిలో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో మార్గమధ్యంలోని కందుకూరు బస్టాండ్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ప్రతి ఒక్కరినీ ఎమ్మెల్యే ఆత్మీయంగా పలకరిస్తూ వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

సుండుపల్లె : మండల కేంద్రంలోని ఆరెమ్మ దేవాలయం వద్ద మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు యర్రపురెడ్డి ఆరంరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతికి చెందిన అరవింద్ కంటి ఆస్పత్రి వైద్యులు ఈ శిబిరంలో కంటి పరీక్షలను ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహిస్తారని, శస్త్రచికిత్సలు అవసరం ఉన్నవారిని అరవింద్ కంటి ఆసుపత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు చేయించి తిరిగి ఇళ్లకు చేర్చనున్నట్లు వారు తెలిపారు. కావున మండలంలోని ప్రజలందరూ ఈ ఉచిత కంటివైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

డిసెంబర్ 14న నీటి సంఘం ఎన్నికలు

సుండుపల్లె : ఈనెల 14వ తేదీన నీటి సంఘం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు జలవనరులశాఖ ఏఈ నాగేంద్ర నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పింఛా ప్రాజెక్టు, కృష్ణారెడ్డి చెరువు, గూనేటి వాగు చెరువు, ఈట చెరువు, నారాయణరెడ్డి చెరువులకు ఎన్నికలు నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రతి రైతు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు.

వంతెన ఏర్పాటు చేయాలి

రామాపురం : మండల పరిధిలోని కసిరెడ్డిగారి పల్లెకు వెళ్లే దారిలో వర్షపు నీరు వచ్చి బ్రిడ్జి కొట్టుకుపోయిందని ఆ గ్రామానికి చెందిన నాయకుడు ధనుంజయ, నాగరాజులు తెలిపారు. గ్రామం నుంచి జాతీయ రహదారిపైకి వెళ్లాలంటే రోడ్డు ఇరువైపుల బాగా దెబ్బతిందన్నారు. దీంతో ఎప్పుడు ఎక్కడ ఏ గుంతలో పడతామోనని వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. వెంటనే రోడ్డుకు వంతెన ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

మదనపల్లె సిటీ: జాతీయ స్థాయి ప్రతిభ ఉపకార వేతనం (ఎన్ఎంఎంఎస్)-2024 పరీక్ష ఆదివారం మదనపల్లెలో ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, హోప్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాల, వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల(ఆర్ ఆర్ లేవుట్)లో జరిగిన పరీక్షలో 931 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 888 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 43 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి పర్యవేక్షించారు.


హోప్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పరీక్షను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి

సీనియర్ సిటిజన్స్ సేవలు విస్తృతం చేస్తాం

మదనపల్లె సిటీ: సీనియర్ సిటిజెన్స్ ఆధ్వర్యంలో సేవలను మరింత విస్తృతం చేస్తామని సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్.మునిగోపాలకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సీనియర్ సిటిజెన్స్ మదనపల్లెశాఖ గౌరవ అధ్యక్షులు మునిగోపాలకృష్ణకు డాక్టరేట్ రావడం, మరో సభ్యుడు ప్రసాద్ జిల్లా వినియోగదారుల ఫోరం డైరెక్టర్‌గా నియమించడంపై సన్మానించారు. సీనియర్ సిటిజెన్స్ సమస్యలపై చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సభ్యులు శ్రీనివాసులు, తిమ్మయ్య, ధనలక్ష్మి, సరస్వతి, రామచంద్రయ్య,టి.ఎస్.ఎ. క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


మునిరత్నంను సన్మానిస్తున్న సీనియర్ సిటిజెన్స్

పంచాయతీ పైపులైన్ ఏర్పాటుకు సర్వే

పీలేరు రూరల్ : పీలేరు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పట్టణానికి తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేయడానికి అధికారులు సర్వే నిర్వహించారు. ఆదివారం పట్టణంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా క్వాలిటీ కంట్రోల్ డీఈ జయచంద్ర సర్వే పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణలలో ఆర్‌టీబీ పనులు జరుగుతున్న నేపథ్యంలో స్థానిక మదనపల్లె మార్గం కొండారెడ్డి సర్కిల్ నుంచి ఎస్‌వీ మహల్ వరకు సుమారు రెండు కిలోమీటర్లు తాగునీటి పైపులైన్ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇరగన్న, వాటర్‌మెన్ వెంకటరామయ్య పాల్గొన్నారు.


సర్వే నిర్వహిస్తున్న అధికారులు

తక్కువ ఖర్చుతో ప్రకృతి సేద్యం

తంబళ్లపల్లె: రైతులు ప్రకృతి సేద్యం చేస్తే తక్కువ ఖర్చుతో రసాయనరహిత పంట దిగుబడితో మంచి ఆదాయం పొందవచ్చునని ఏపీసీఎన్ఎఫ్ జూనియర్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ పవన్, ఎన్ఎఫ్ఏ సునిత తెలిపారు. మండలంలోని ఎర్రసానిపల్లె పంచాయతీలో ఆర్‌వైఎస్ఎస్,ఏపిసీఎన్ఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్యం పోషణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రసాయరహిత ఉత్పత్తులు చిరుధాన్యాలు, పప్పుదినుసులు వల్ల కలిగే ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలు, కిషోరబాలికలకు వివరించారు. అనంతరం చిరు పప్పుదినుసుల ఫుడ్‌బాస్కెట్‌లను 72 మహిళా సంఘాల కుటుంబాలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎపిసీఎన్ఎఫ్ సిబ్బంది సునిత, సుజాత, పద్మావతి, నిజాం, రాజు, రఘునాథ్ పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయంపై సూచనలు ఇస్తున్న ఎన్ఎఫ్ఏ సునిత

కేసులు సామరస్యంగా పరిష్కరించుకోవాలి

సుండుపల్లె : మండల పరిధిలోని జి.రెడ్డివారిపల్లి, గుండ్లపల్లి, పింఛాతోపాటు పలు గ్రామాలలో ఆదివారం పోలీసులు పర్యటించి లోక్ అదాలత్ కేసులు విషయంలో విచారణ చేపట్టారు. లోక్ అదాలత్ అనేది కోర్టుల వెలుపల వివాదాలను సామరస్యంగా కేసులను పరిష్కరించుకోవడం ఉద్దేశించబడిందని కోర్టు కానిస్టేబుల్ ఈశ్వర్ తెలిపారు. ఇందులో ఆస్తి అభ్యర్థన, ఆర్థిక వివాదాలు, వైవాహిక సమస్యలు వంటి కుటుంబ వివాదాలను లోక్ అదాలత్ ద్వారా సమర్థవంతంగా పరిష్కరించబడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ ప్రవీణ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

గుర్రంకొండ: రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి విమర్శించారు. ఆదివారం మండలంలోని టి.రాచపల్లెలో మొర్రంరెడ్డి జశ్వంత్‌రెడ్డి ఇంట్లో జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. అనంతరం టి.రాచపల్లెలో కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాల జాడే లేకుండా పోయిందన్నారు. అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్నారు. ఎన్నో ఆశలతో ఓట్లు వేసిన ప్రజలకు ప్రభుత్వం ద్రోహం చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడుస్తున్నా మహిళలకు ఒక్క సంక్షేమ పథకం అందించలేదన్నారు. చివరకు ఆమ్మ ఒడి పథకాన్ని కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తుంగలో తొక్కుతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం గాల్లో కలిసి పోయిందన్నారు. పావలా వడ్డీ రుణాలు, డ్వాక్రా మహిళలకు ఏ ఒక్క పథకాన్ని ఇవ్వడం లేదన్నారు. సంక్షేమ పథకాల కోసం ప్రజలు ఎదురుచూడాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యల్లారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రెడ్డి నరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసులురెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, రెడ్డిమల్‌రెడ్డి, గంగిరెడ్డి పాల్గొన్నారు.


కార్యకర్తలతో కలసి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

అంగన్‌వాడీలకు వేతనం చెల్లించాలి

మదనపల్లె : అంగన్‌వాడీలకు వెంటనే వేతనాలు చెల్లించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి పి. రాజేశ్వరి డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో... అంగన్‌వాడీలకు ప్రతి నెలా 5వ తేదీ లోపు వేతనాలు ఇస్తామన్న పాలకులు హామీని అమలు చేయకపోవడం దుర్మార్గం అన్నారు. అంగన్‌వాడీల చేత గొడ్డు చాకిరీ చేయించుకునే ప్రభుత్వాలు వారికి ఇచ్చే వేతనాలు ఏ మూలకు సరిపోవని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చే అరకొర వేతనం కూడా ప్రతి నెలా చెల్లించక పోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయి కుటుంబ పోషణ కష్టమవుతున్న తరుణంలో వేతనాలు రాకపోతే మూలిగే నక్కపై ఎలక్కాయ పడినట్లే అంగన్‌వాడీల జీవితాలు ఉన్నాయన్నారు. కూరగాయలు, గ్యాస్ బిల్లులు కూడా చెల్లించనందున అంగన్‌వాడీలపై మరింత భారం పడుతుందని ఆవేదన చెందారు.

మైనార్టీల గణనను రద్దుచేయాలి

రాయచోటి అర్బన్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న మైనార్టీ పిల్లల గణనను వెంటనే రద్దుచేయాలని సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో మతప్రాతిపదికన జరుగుతున్న చిన్నపిల్లల వివరాల సేకరణను వెంటనే ఆపేయాలన్నారు. 2014 నుంచి 2023 మధ్యకాలంలో పుట్టిన ముస్లిం, క్రిస్టియన్, మైనార్టీ వర్గాలకు చెందిన పిల్లల వివరాలు, వీరిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరినవారి నిష్పత్తిని సేకరించి 24గంటల్లో అందివ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను తక్షణమే నిలిపివేయాలంటూ ఆయన డిమాండ్ చేశారు. రాజ్యాంగ విరుద్ధమైన మతపరమైన వివరాలు సేకరించడం వెనుక ఉన్న ఎజెండా ఏమిటో వివరించాలంటూ కోరారు.

పోస్టుల భర్తీని పారదర్శకంగా చేపట్టాలి

రాయచోటి అర్బన్ : జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీని పారదర్శకంగా చేపట్టాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు నాయకురాళ్లు భాగ్యలక్ష్మి, సిద్దమ్మ, అనసూయమ్మ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

కురుబల అభ్యున్నతికి కృషి చేయాలి

మదనపల్లె : కురుబ కార్పొరేషన్‌కు నూతనంగా ఎంపికైన డైరెక్టర్లు కురబల అభ్యున్నతికి కృషిచేయాలని కురుబ సంఘ సామాజిక సేవా సొసైటీ, మదనపల్లె డివిజన్ కమిటీ సభ్యులు కోరారు. ఉమ్మడి చిత్తూరుజిల్లా నుంచి కురుబ కార్పొరేషన్ డైరెక్టర్లుగా నూతన నియామకాలు పొందిన వల్లిగట్ల వెంకటరమణ, రాజగోపాల్, ఉయ్యాలరమణ, సుబ్రహ్మణ్యం గౌడలను ఆదివారం మదనపల్లె డివిజన్ కురుబ సంఘ సామాజిక సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో కురుబల ప్రాబల్యాన్ని గుర్తించి నలుగురికి డైరెక్టర్లుగా అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. కురబల సంక్షేమానికి కృషి చేయాలని, కార్పొరేషన్ ద్వారా అర్హులైన కురుబలకు విరివిగా రుణాలు అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో మదనపల్లె డివిజన్ కురుబ సంఘ సామాజిక సేవా సొసైటీ అధ్యక్షులు ఆర్.కే.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి మర్రిపాటిరమేష్, కోశాధికారి బి.రెడ్డెప్ప, వలిగట్లరెడ్డెప్ప, జబ్బలశ్రీనివాసులు, దండురామాంజులు, గుడేశ్రీనివాసులు, మేజారిసదాశివ, బెల్లే రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


కురుబ కార్పొరేషన్ డైరెక్టర్లను సన్మానిస్తున్న నాయకులు

రెడ్డెమ్మతల్లీ..చల్లంగ చూడమ్మా


సంతానం కోసం వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. రెడ్డెమ్మతల్లీ చల్లంగా చూడమ్మా అంటూ భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారికి ఉదయాన్నే పలు రకాల నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతాన ప్రసాదించే తల్లిగా ప్రసిద్ధి పొందిన అమ్మవారి కోనేట్లో భక్తులు పవిత్ర స్నానమాచరించి సంతానం కోసం వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

శాఖాహారంతో ఆరోగ్య సమస్యలు దూరం

రాజంపేట టౌన్ : శాఖాహారంతో ఆరోగ్య సమస్యలు దూరం కాగలవని సంత్ సదానందగిరి స్వామి మహరాజ్ తెలిపారు. పట్టణంలోని సరస్వతి పిరమిడ్ ధ్యానమందిరం ఆరవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం మహాకరుణ శాఖాహార శాంతి ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సదానంద గిరిస్వామి మహరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం పిరమిడ్ ధ్యాన మందిరంలో పట్టణ ప్రజలనుద్దేశించి ఆధ్యాత్మికోపన్యాసం చేశారు. మనిషికి ఆరోగ్యానికి మించిన సంపద మరొకటి లేదన్నారు. ప్రతి ఒక్కరు మంచి ఆహారపు అలవాట్లను అలవరుచుకోవాలని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్యవంతులే నిజమైన సంపన్నులని తెలిపారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా వేళకు చక్కగా ఆహారం తీసుకుంటూ కంటినిండా నిద్రపట్టిన వారు అదృష్టవంతులని తెలిపారు. మనిషి ఆహారపు అలవాట్లతోపాటు ఆధ్యాత్మిక భావాలను అలవరుచుకోవాలని సూచించారు.

సబ్సిడీ పరికరాలు తుప్పపట్టాల్సిందేనా?

గుర్రంకొండలోని వెలుగు కార్యాలయంలో సబ్సిడీ వ్యవసాయ పరికరాలు మూలనపడ్డాయి. గిరిజనులు తేనే తయారీ కోసం వినియోగించే యంత్రాలు కార్యాలయంలో తుప్పు పడుతున్నాయి. రైతులకు 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేయడానికి వ్యవసాయ యంత్రాలు ఎడేళ్ల క్రితం స్థానిక వెలుగు కార్యాలయానికి వచ్చాయి. మొత్తం 13 ట్రాక్టర్‌తో దున్నే ఒంటి మడకలు మంజూరయ్యాయి. ఒక్కో మడక విలువ రూ.14.666కాగా అందులో 50 శాతం సబ్సిడీ ఉంటుంది. వీటితో పాటు గిరిజనలకు ఉపాధి కల్పించడం కోసం తేనే తయారీ చేసే యంత్రాలు అప్పట్లో మంజురయ్యాయి. 75 శాతం సబ్సిడీతో వీటిని పంపిణీ చేయాల్సి ఉంది. ఏళ్లు గడుస్తున్నా అధికారులు వీటి గురించి పట్టించుకోవడం లేదు.

- గుర్రంకొండ


ఉపాధి హామీ కార్యాలయంలో నిరుపయోగంగా ఒంటిమడక యంత్రాలు, తేనే తయారీ పరికరాలు

గూడరేవుపల్లె బ్రిడ్జి గుర్తుకు రాదా?

పీలేరు మండలంలోని పీలేరు - యల్లమంద మార్గంలో ఉన్న గూడరేవుపల్లె వంకపై నిర్మించిన బ్రిడ్జి ప్రమాదకరంగా ఉంది. ఇటీవల కురిసిన తుపాను ప్రభావంతో గూడరేవుపల్లె వంక ప్రవహించింది. బ్రిడ్జికి ఇరువైపు నీరు చేరి ప్రమాదకరంగా ఉంది. నాసిరకం బ్రిడ్జి కావడం, రక్షణ గోడ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో రెండు ఆటో నీటిలో గల్లంతై ఇద్దరు మృతి చెందారు. సంబంధిత అధికారులు స్పందించి శాశ్విత ప్రాతిపదికన వంతెన నిర్మాణం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

- పీలేరు రూరల్


రక్షణ గోడ లేక ప్రమాదకరంగా ఉన్న గూడరేవుపల్లె బ్రిడ్జి